క్లుప్తంగా

లెప్రసీ సర్వేపై ఆరా



వివరాలు తెలుసుకుంటున్న సురేంద్రబాబు

పొదలకూరు: మండలంలోని మరుపూరు, చాటగొట్ల, మొగళ్లూరులో జరుగుతున్న కుష్టు సర్వే గురించి మంగళవారం జిల్లా న్యూక్లియస్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సురేంద్రబాబు ఆరాతీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సర్వేకు సహకరించాల్సిందిగా కోరారు. కార్యక్రమంలో ఫిజియోథెరపిస్ట్ నరసింహులు, పీపీఎంఓ మోహన్‌రావు, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

వైద్యశిబిరాలు ఏర్పాటు చేస్తాం

- జిల్లా మలేరియాధికారి హుస్సేనమ్మ



కాలువను పరిశీలిస్తున్న హుస్సేనమ్మ

పొదలకూరు: ఎక్కడైనా ప్రజలు జ్వరాలతో బాధపడుతుంటే వైద్యశిబిరాలను ఏర్పాటు చేస్తామని జిల్లా మలేరియా అధికారి హుస్సేనమ్మ పేర్కొన్నారు. పట్టణంలోని నర్సారెడ్డికాలనీలో మంగళవారం ఆమె పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఒకే ఏరియాలో ఐదుగురికి జ్వరాలున్నా వెంటనే వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేస్తామన్నారు.

- ఎమ్మార్వో కాలనీలో గర్భిణులకు కో – లొకేటెడ్ పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ కిరణ్ రిషిత వైద్యపరీక్షలను నిర్వహించారు. ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో వివరించారు. పౌష్టికాహారం తీసుకోవాల్సిందిగా సూచించారు. కార్యక్రమంలో ఆరోగ్య సహాయకులు రాధాకుమారి, శివప్రసాద్, సుమాంజలి, కృష్ణమ్మ, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

కమ్మేసిన పొగమంచు



బుచ్చిరెడ్డిపాళెం: పట్టణంలోని జాతీయ రహదారిని పొగ మంచు మంగళవారం కమ్మేసింది. ఫలితంగా నెల్లూరు – ముంబై రహదారిపై రాకపోకలు సాగించే వారు ఇబ్బంది పడ్డారు. ఉదయం 9.30 వరకు ఇదే పరిస్థితి నెలకొంది. కాగా మంచు ప్రభావం వరిపైర్లపై చూపే అవకాశం ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

అక్రమ నిల్వలపై విజిలెన్స్ దాడులు

నెల్లూరు(క్రైమ్): అక్రమ నిల్వలపై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు దాడులను విస్తృతం చేశారు. ఇందులో భాగంగా స్టోన్‌హౌస్‌పేటలోని జీనిగాలవీధిలో ఓ ఇంటిపై మంగళవారం దాడులు జరిపి అక్రమంగా నిల్వ ఉంచిన రూ.17.35 లక్షల విలువజేసే సిగరెట్లను స్వాధీనం చేసుకున్నారు. ఓ గోదాములో రూ.లక్షల విలువజేసే పాన్‌మసాలా, పొగాకు ఉత్పత్తులను గుర్తించారు. సరుకుకు సంబంధించిన బిల్లులను గోదాము నిర్వాహకుడు చూపడంతో వాటిని అధికారులు పరిశీలిస్తున్నారు. విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్ సుభాన్, డీసీటీఓ విష్ణురావు, ఏఓ యానాది తదితరులు పాల్గొన్నారు.

చెత్త సమస్య పట్టదా?

మండలంలోని కాకుటూరు పంచాయతీ పరిధిలో పరిశ్రమల కేంద్రం వద్ద చెత్తనిల్వలు పెరిగిపోతున్నాయి. అధికారుల పట్టించుకోకపోవడంతో కొందరు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. ఈ కేంద్రానికి సమీపంలో విక్రమ సింహపురి యూనివర్సిటీ ఉంది. అక్కడ చదువుతున్న విద్యార్థులతోపాటు పరిశ్రమల్లో పనిచేసే కార్మికులు దుర్వాసన భరించలేకపోతున్నారు.

- కాకుటూరు పరిశ్రమల కేంద్రంలో పేరుకుపోతున్న నిల్వలు
- దుర్వాసన భరించలేకపోతున్న వీఎస్‌యూ విద్యార్థులు, కార్మికులు
- పట్టించుకోని అధికారులు



ఓ పరిశ్రమ నిర్వాహకుడు నెలల తరబడి ఉంచిన ప్లాస్టిక్ వ్యర్థాలు

వెంకటాచలం: మండలంలోని కాకుటూరు పంచాయతీ పరిధిలో జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న పరిశ్రమల కేంద్రం మధ్యలో తిక్కవరప్పాడు బ్రాంచ్ కెనాల్ ఉంది. ఈ కేంద్రానికి వెనుక వైపు విక్రమ సింహపురి యూనివర్సిటీ ఉంది. మొత్తం 50కి పైగా పరిశ్రమలుండగా, ప్లాస్టిక్‌కు సంబంధించినవి నాలుగు ఉన్నాయి. జిల్లా నలుమూలల నుంచి తీసుకొచ్చిన ప్లాస్టిక్ వ్యర్థాలను పలువురు నిర్వాహకులు రోడ్లపైనే నెలల తరబడి నిల్వ ఉంచుతున్నారు. అలాగే నగరంలో పోగయ్యే చెత్తను వేసేందుకు కొత్తూరు ప్రాంతంలో డంపింగ్ యార్డ్ ఉంది. టిప్పర్లు నెల్లూరు నుంచి జాతీయ రహదారి గుండా వచ్చి తిక్కవరప్పాడు బ్రాంచ్ కెనాల్‌పై వెళ్లి డంపింగ్ యార్డ్‌లో చెత్తను వేస్తున్నాయి. అయితే కొందరు టిప్పర్ డ్రైవర్లు యార్డు వరకు వెళ్లకుండా బ్రాంచ్ కెనాల్ పొడవునా చెత్తను అన్‌లోడ్ చేసి వెళ్లిపోతున్నారు. దీంతో అక్కడ పరిస్థితులు అధ్వానంగా మారాయి. కాలువకట్టపై చెత్తను వేయడంతో సమీపానే ఉన్న విక్రమ సింహపురి యూనివర్సిటీ హాస్టల్ విద్యార్థులు, పరిశ్రమల్లో పని చేసే సిబ్బంది ఇబ్బంది పడుతున్నారు. కొందరు ఆరోగ్య సమస్యలతో సతమతమవుతున్నారు.

భరించలేనంతగా..

కాకుటూరు పంచాయతీ పరిశ్రమల కేంద్రం మధ్యలో నెల్లూరు నగరానికి చెందిన చెత్తను పడేస్తుండటం, కొందరు నిర్వాహకులు ప్లాస్టిక్ వ్యర్థాలను నిబంధనలకు విరుద్ధంగా నెలల తరబడి రోడ్లపై నిల్వ ఉంచడంతో ఈ ప్రాంతంలో నిత్యం భరించలేని దుర్వాసన వస్తోంది. మిగిలిన పరిశ్రమల నిర్వాహకులు, అధికారులు ఈ సమస్య గురించి పట్టించుకోవడంలేదు. పరిశ్రమల్లోని సిబ్బందే కాక, జాతీయ రహదారి సమీపాన కాలువ ఉండటంతో వాహనచోదకులు దుర్వాసనను తట్టుకోలేకపోతున్నారు. ఇటువైపు నిత్యం అధికారులు రాకపోకలు సాగిస్తుంటారు. ముక్కు మూసుకుని వెళ్తున్నారే తప్ప చెత్త ఎందుకు అన్‌లోడ్ చేస్తున్నారని ప్రశ్నించడం లేదు. గతంలో యూనివర్సిటీ అధికారులు నెల్లూరు కార్పొరేషన్ అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో కొన్ని రోజులు టిప్పర్ డ్రైవర్లు తిక్కవరప్పాడు బ్రాంచ్ కెనాల్‌పై చెత్త డంపింగ్ చేయలేదు. మళ్లీ కొద్దినెలల నుంచి కాలువకట్టపై వేస్తున్నారు. హాస్టల్లో దోమల బెడద ఎక్కువగా ఉందని విద్యార్థులు వాపోతున్నారు. ఉన్నతాధికారులు తగిన చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

చర్యలు తీసుకుంటాం

వీఎస్‌యూకు సమీపాన చెత్తనిల్వలు వేస్తుంటే గతంలో నెల్లూరు కార్పొరేషన్ అధికారుల దృష్టికి తీసుకెళ్లాం. తగిన చర్యలు చేపట్టాం. మళ్లీ చెత్తనిల్వలు వేస్తున్నారనే విషయం మా దృష్టికి రాలేదు. వెంటనే నెల్లూరు కార్పొరేషన్ అధికారులతో మాట్లాడి చర్యలు తీసుకుంటాం.

– డాక్టర్ కె.సునీత, ఇన్‌చార్జి రిజిస్ట్రార్ వీఎస్‌యూ



వీఎస్‌యూ హాస్టల్‌కు సమీపాన తిక్కవరప్పాడు బ్రాంచ్ కెనాల్‌పై ఇలా..



టిప్పర్లలో తరలిస్తున్న చెత్త

గ్రామసభలు నేడు

కోవూరు: మండలంలోని ప్రతి గ్రామంలో గ్రామసభను బుధవారం నిర్వహించాలని ఎంపీడీఓ చిలకల శ్రీహరిరెడ్డి పేర్కొన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన గ్రామాభివృద్ధికి ప్రణాళికలను రూపొందించాలని కోరారు.

ఇళ్ల స్థలాలు కేటాయించాలని వినతి

ముత్తుకూరు: ఇంటి నివేశన స్థలాలు కేటాయించాలని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డికి మత్స్య కళాశాలలో పనిచేసే కాంట్రాక్ట్ కార్మికులు వినతిపత్రం అందజేశారు. మంగళవారం కళాశాల సమావేశ మందిరంలో సచివాలయ ఉద్యోగులతో సమావేశమయ్యేందుకు వచ్చిన సోమిరెడ్డిని వారు కలిశారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు సమాన పనికి సమాన వేతనం అందించేందుకు కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు.

ఆంజనేయస్వామికి విశేష పూజలు



పొదలకూరు: పట్టణంలోని మారుతీ నగర్ శ్రీవీర అభయాంజనేయ స్వామి ఆలయంలో మంగళవారం విశేష పూజలు నిర్వహించారు. సాయంత్రం స్వామికి ప్రత్యేక పూజలు, పల్లకి సేవ జరిగాయి. భక్తులు అధిక సంఖ్యలో విచ్చేశారు.

బాల్య వివాహాలను ప్రోత్సహిస్తే రెండేళ్ల జైలు

మనుబోలు: 'బాల్య వివాహాలను అరికట్టాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉంది. వాటిని ప్రోత్సహిస్తే రెండేళ్ల జైలు శిక్ష తప్పదు' అని ఐసీడీఎస్ సీడీపీఓ విజయలక్ష్మి హెచ్చరించారు. మండలంలోని పిడూరుపాళెం ఎస్టీ కాలనీలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో మంగళవారం బాల్య వివాహాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ గేయ పూజిత మాట్లాడారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ రమణమ్మ, ఏఎన్‌ఎం ఇంద్రసేన, అంగన్‌వాడీలు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

- **కొడవలూరు:** బాల్య వివాహాలతో బాలికల ఆరోగ్యానికి ముప్పు వాటిల్లుతుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పద్మావతి పేర్కొన్నారు. బాల్య వివాహాలతో సంభవించే అనర్థాలపై మండలంలోని యల్లాయపాళెం మజరా రెడ్డిగుంట అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. బాల్య వివాహాలు జరుగుతున్నాయని తెలిస్తే వెంటనే సంబంధిత అంగన్‌వాడీ కార్యకర్తకు తెలియజేయాలని కోరారు. అంగన్‌వాడీ కార్యకర్త రాధమ్మ పాల్గొన్నారు.



కొడవలూరు: అవగాహన కల్పిస్తున్న పద్మావతి

మర్యాదపూర్వకంగా..



కోవూరు: మాజీ మంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి, పార్టీ నియోజకవర్గ యువజన విభాగ కమిటీ అధ్యక్షుడు నల్లపరెడ్డి రజత్‌కుమార్‌రెడ్డిని నెల్లూరులోని వారి నివాసంలో పార్టీ మండలాధ్యక్షులు మర్యాదపూర్వకంగా మంగళవారం కలిశారు. ఈ సందర్భంగా మొక్కను అందజేసి కృతజ్ఞతలను తెలియజేశారు. పార్టీ కోవూరు, ఇందుకూరుపేట, బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీ, రూరల్ మండలాధ్యక్షులు అత్తిపల్లి అనూప్‌రెడ్డి, మావులూరు శ్రీనివాసులురెడ్డి, టంగుటూరు మల్లికార్జున్‌రెడ్డిని, చెర్లో సతీష్‌రెడ్డి, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి దొడ్డంరెడ్డి నిరంజన్‌బాబురెడ్డి, కోవూరు జెడ్పీటీసీ కవరిగిరి శ్రీలత పాల్గొన్నారు.



యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు

తోటపల్లిగూడూరు: యాజమాన్య పద్ధతులు పాటిస్తే వరి సాగులో అధిక దిగుబడులను సాధించవచ్చని ఇందుకూరుపేట డివిజన్ వ్యవసాయ సహాయ సంచాలకుడు రాజ్‌కుమార్ సూచించారు. మండలంలోని వరిగొండ – 1, వరిగొండ – 2 గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాలు జరిగాయి. రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారిణి శిరీషారాణి, వీఏఏ సుమంత్, ఏఈఓ ప్రసన్న కావేరి తదితరులు పాల్గొన్నారు.

- **పొదలకూరు:** ఎలుకల నివారణ మందును రాయితీపై రైతులకు అందజేస్తున్నట్టు పొదలకూరు సహాయ వ్యవసాయ సంచాలకుడు కె.శివనాయక్ పేర్కొన్నారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండలంలోని మొగళ్లూరు, వావింటపర్తిలో రైతు సేవా కేంద్రాల్లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ కేంద్రాల్లో పంటలను నమోదు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఓ ఎ.వాసు, ఏఈఓ ఏడుకొండలునాయక్, దీప, శ్రీనివాసతేజ తదితరులు పాల్గొన్నారు.
- **కొడవలూరు:** ఎలుకల నివారణ మందును సామూహికంగా రైతులు ఉపయోగిస్తేనే ప్రయోజనం ఉంటుందని ఏఓ లక్ష్మి పేర్కొన్నారు. మండలంలోని గుండాలమ్మపాళెం, నార్తురాజుపాళెంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాలను నిర్వహించారు. ఎలుకల నివారణపై ప్రయోగాత్మకంగా రైతులకు అవగాహన కల్పించారు. అనంతరం బ్రోమోడైలిన్ మందును పంపిణీ చేశారు. వీఏఏలు విష్ణుప్రియ, కవిత, శివజ్ఞాన, స్థానిక నేత కోటంరెడ్డి అమరేంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.
- **కోవూరు:** యాజమాన్య పద్ధతులను రైతులు తప్పక పాటించాలని ఏఓ ఇందిరావతి కోరారు. మండలంలోని వేగూరు, జమ్మిపాళెంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాలను నిర్వహించారు. వీఏఏలు సుభాషిణి, చైతన్య, బ్యాంక్ అధికారి రవి శంకర్, సూరయ్య పాల్గొన్నారు.



కొడవలూరు: గుండాలమ్మపాళెంలో పొలం పిలుస్తోంది



పొదలకూరులో..



కోవూరులో..



తోటపల్లిగూడూరు: వరిగొండ - 1లో..

జాబ్‌మేళా రేపు

నెల్లూరు (పొగతోట): కోవూరులోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాబ్ మేళాను ఏపీఎస్సెస్డీసీ, ఎంప్లాయ్‌మెంట్ ఆఫీస్, సీడాప్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించనున్నామని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి అబ్దుల్ ఖయ్యూం మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వివిధ కంపెనీలు హాజరుకానున్నాయని చెప్పారు. పదో తరగతి, ఐటీఐ, డిప్లొమా, ఇంటర్, డిగ్రీ చదివిన వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, వివరాలకు 99888 53335, 87126 55686 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

గ్రామాల్లో పశు ఆరోగ్య శిబిరాలు

ముత్తుకూరు: మండలంలోని కృష్ణపట్నం గ్రామంలో మంగళవారం పశు ఆరోగ్య శిబిరాన్ని వెటర్నరీ ఏడీ నిర్మల ప్రారంభించారు. 179 పశువులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. లేగదూడలకు నట్టల నివారణ మందు వేశారు. వివిధ జబ్బులకు గురైన పశువులకు చికిత్స చేశారు. మునునూరువారిపాళెం, బ్రహ్మదేవి, వల్లూరు పశువైద్యాధికారులు గోవర్ధన్, శివతేజరెడ్డి, రాజ్యలక్ష్మి, గోపాలమిత్ర మురళి పాల్గొన్నారు.

బండేపల్లిలో..

మనుబోలు: మండలంలోని బండేపల్లి గ్రామంలో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో మంగళవారం పశు ఆరోగ్య శిబిరం జరిగింది. ఈ సందర్భంగా మడమనూరు పశు వైద్యశాల వైద్యాధికారి డాక్టర్ షరీఫ్ మాట్లాడుతూ 87 గొర్రెలు, మేకలు, 35 పెద్ద పశువులు, 20 దూడలకు నట్టల నివారణ మందులను పంపిణీ చేశామన్నారు. సిబ్బంది కల్యాణి, కామక్షమ్మ, మస్తానయ్య, ఇమామ్‌బాషా తదితరులు పాల్గొన్నారు.



మనుబోలు: గేదెకు చికిత్స చేస్తున్న వైద్యుడు, సిబ్బంది

మద్యం తాగి వాహనాలు నడపొద్దు

పొదలకూరు: మద్యం తాగి వాహనాలను నడపొద్దని ఎస్సై ఎస్కే హనీఫ్ తెలిపారు. రహదారి భద్రతా మాసోత్సవాల ర్యాలీని ఎస్సై ఆధ్వర్యంలో మంగళవారం పట్టణంలో నిర్వహించారు. ఇందులో ప్రైవేట్ కళాశాలల విద్యార్థులు ర్యాలీ పాల్గొన్నారు. ఎస్సై మాట్లాడుతూ ట్రాఫిక్ నిబంధనలను పాటించకపోవడంతో రోడ్డు ప్రమాదాల్లో మరణాలు సంభవిస్తున్నట్టు పేర్కొన్నారు. వచ్చే నెల 15వ తేదీ వరకు మాసోత్సవాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. వాహనాలు నడిపే సమయంలో జాగ్రత్తలు పాటించాల్సిందిగా సూచించారు.

- **తోటపల్లిగూడూరు:** ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని వీరేంద్రబాబు సూచించారు. తోటపల్లిగూడూరు మండల కేంద్రంలో మంగళవారం రహదారి భద్రతా మాసోత్సవాలు జరిగాయి. తోటపల్లిగూడూరు ప్రభుత్వ కళాశాల, ఉన్నత పాఠశాలల విద్యార్థులతో కలిసి ఎస్సై ర్యాలీ, అవగాహన సదస్సును నిర్వహించారు. కార్యక్రమంలో తోటపల్లిగూడూరు ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపల్ ధనుంజయ, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.
- **కోవూరు:** ప్రమాదాల నివారణ ప్రతి ఒక్కరి బాధ్యత అని సీఐ సుధాకర్‌రెడ్డి పేర్కొన్నారు. కోవూరులోని గీతాంజలి ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో రోడ్డు భద్రత మాసోత్సవాలను మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా హెల్మెట్‌ధారణపై అవగాహన కల్పిస్తూ విద్యార్థులతో ర్యాలీని నిర్వహించారు. ఎస్సై రంగనాథ్‌గౌడ్, ప్రిన్సిపల్ సందీప్‌కుమార్, రవాణా శాఖ అధికారులు శ్రీనివాస్, నరేంద్రనాయక్ తదితరులు పాల్గొన్నారు.
- **బుచ్చిరెడ్డిపాళెం:** పట్టణ పరిధిలోని ముంబై జాతీయ రహదారిపై భారీ ర్యాలీని విద్యార్థులు, ప్రజలతో పోలీసులు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ శ్రీనివాసులురెడ్డి మాట్లాడారు. లైసెన్స్ లేకుండా వాహనాలను నడిపితే చర్యలు తప్పవని స్పష్టం చేశారు. ఎస్సై సంతోష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



తోటపల్లిగూడూరు: విద్యార్థులతో ర్యాలీ నిర్వహిస్తున్న పోలీసులు



కోవూరు: హెల్మెట్‌ధారణపై అవగాహన ర్యాలీ



బుచ్చిరెడ్డిపాళెంలో..



పొదలకూరులో..

ఏడు అదనపు ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): రానున్న వేసవిని దృష్టిలో ఉంచుకొని వినియోగదారులకు ఎలాంటి ఇబ్బంది తలెత్తకుండా ఇండస్ట్రియల్ ఎస్టేట్ సెక్షన్లో ఏడు అదనపు ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేశామని నెల్లూరు టౌన్ ఈఈ శ్రీధర్ పేర్కొన్నారు. నగరంలోని డీఆర్డీఏ సబ్‌స్టేషన్లో ఇండస్ట్రియల్ ఎస్టేట్ సెక్షన్ సిబ్బందితో మంగళవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. 100 కేవీఏ సామర్థ్యం గల ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుకు రూ.పది లక్షలవుతుందని, ఈ క్రమంలో రూ.70 లక్షలతో వీటిని ఏర్పాటు చేశామని వెల్లడించారు. సిబ్బంది వారి పరిధిలోని విద్యుత్ లైన్లు, ట్రాన్స్‌ఫార్మర్లను నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. పీఎం సోలార్ విద్యుత్, డిజిటల్ పేమెంట్లపై అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. బకాయిలను వెంటనే వసూలు చేయాలని ఆదేశించారు. డీఈఈ అశోక్, ఏఈ లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

1న అవార్డుల ప్రదానం

నెల్లూరు(బృందావనం): రాష్ట్రస్థాయిలో వైద్య, న్యాయ, సామాజిక, కళారంగాల్లో ఉత్తమ సేవలందించిన వారికి సేవా పారాయణులు పురస్కారాలను ఫిబ్రవరి ఒకటిన అందజేయనున్నామని కేతా అంకుల్ మెమోరియల్ ట్రస్ట్ అధ్యక్షుడు కేతా సుబ్బారావు పేర్కొన్నారు. దీనికి సంబంధించిన ఆహ్వాన పత్రికలను మంగళవారం ఆవిష్కరించిన అనంతరం ఆయన మాట్లాడారు. ఆసక్తి గల వారు ధ్రువీకరణ పత్రాలతో తమ దరఖాస్తులను ఈ నెల 26లోపు పంపాలని, వివరాలకు 77299 42543 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు. రఘురామిరెడ్డి, వంశీకృష్ణారెడ్డి, అమానుల్లాఖాన్ పాల్గొన్నారు.



ఆహ్వాన పత్రికల ఆవిష్కరణ